www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 17 సెప్టెంబర్ 2025
5
తిరుపతి

ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్‌గా విజయభాస్కర్‌రావు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఉన్నత విద్యామండలి వైస్‌ఛైర్మన్‌గా ఎస్వీ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ విజయ భాస్కర్‌రావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. భౌతికశాస్త్ర విభాగం ఇన్‌ఛార్జిగా ఉన్న ఆయన విక్రమ సింహపురి యూనివర్సిటీ ఇన్‌ఛార్జి వీసీగా ఏడాదిపాటు కొనసాగారు. వీసీ శాస్వత పోస్టులు ఇవ్వకపోవడంతో ఎస్వీయూ మాతృసంస్థకు వచ్చారు. ప్రస్తుతం ఉన్నత విద్యామండలి వైస్‌ఛైర్మన్‌గా నియమితులయ్యారు. త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నారు.

మతమార్పిడులు అరికట్టేందుకు...

దళితవాడల్లో వెయ్యి ఆలయాలు

- ఇస్రో సాయంతో క్రౌడ్ మేనేజ్మెంట్
- బ్రహ్మాండంగా బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు
- టిటిడి పాలక మండలి నిర్ణయాలు



నూతన ఈవో సింఘాల్‌కు సత్కారం

ప్రజాశక్తి - తిరుమల

ఈనెల 23న శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ ఉంటుందని, 24న ధ్వజారోహణం రోజు సిఎం చంద్రబాబు దంపతులు రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారని టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు వెల్లడించారు. తమ పాలకమండలి ఏర్పాటయ్యాక ఇవి తొలి బ్రహ్మోత్సవాలని, బ్రహ్మాండంగా జరపాలని ఏర్పాట్లపై పాలకమండలిలో చర్చించామన్నారు. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో దళితవాడల్లో వెయ్యి ఆలయాలు నిర్మించాలని తీర్మానం చేశామన్నారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో ఆరు ఆలయాలు నిర్మిస్తామన్నారు. మతమార్పిడులు అరికట్టేందుకు శ్రీవాణి ట్రస్టు నిధులతో ఏపీ వ్యాప్తంగా ఆలయాలు నిర్మిస్తామన్నారు. టిటిడి పాలకమండలి సమావేశం తిరుమల అన్నమయ్య భవనంలో మంగళవారం మధ్యాహ్నం జరిగింది. అనంతరం పాలకమండలి నిర్ణయాలను బిఆర్‌నాయుడు మీడియాకు వివరించారు. 23వ తేదీ నుంచి అక్టోబర్ 2 వరకూ పది రోజుల పాటు సిఫార్సు లేఖలపై విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు చేసినట్లు తెలిపారు. 28న గరుడసేవకు మూడు లక్షలకు పైగా భక్తులు వస్తారని అంచనా వేశారు. చిన్నపిల్లలు తప్పిపోకుండా జియోట్యాగింగ్ విధానం అమలు చేయనున్నట్లు చెప్పారు. విద్యుత్ అంతరాయం లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కనీవినీ ఎరుగని రీతిలో ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. గతంలోచోటు చేసుకున్న ఘటనలను దృష్టిలో ఉంచుకుని లోపాలను సరిచేస్తున్నామన్నారు. పది రోజుల బ్రహ్మోత్సవ పండుగను ప్రపంచానికి చాటిచెప్పేలా హైక్వాలిటీ వీడియోచిత్రీకరించి టిటిడికి ఉచితంగా అందజేసేందుకు ముంబాయికిచెందిన ఓ సంస్థ ముందుకొచ్చిందన్నారు. టిటిడి చరిత్రలో మొదటిసారి బ్రహ్మోత్సవాలను ఇస్రో పరిశీలించనుందన్నారు. ఎప్పటికప్పుడు రద్దీ క్రమబద్ధీకరణకు శాటిలైట్ పిక్చర్ ఉంటుందన్నారు. టిటిడిపై నిరాధారమైన ఆరోపణలు చేస్తే క్రిమినల్ కేసులు పెట్టాలని బోర్డు కీలక నిర్ణయం తీసుకుందన్నారు. తప్పుడు ప్రచారాలు చేసేవారిపై చర్యలు చాలా సీరియస్‌గా ఉంటుందన్నారు. తిరుమల పవిత్రత దెబ్బతినేలా టిటిడి ప్రతిష్ట దిగజార్చేలా మాట్లాడితే జైలుకు వెళ్లడం ఖాయమన్నారు.

భక్తులకు మరింతగా సేవ చేస్తాం : టిటిడి ఈవో

టిటిడి ఈవోగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన అనీల్‌కుమార్ సింఘాల్‌కు పాలకమండలి ఛైర్మన్ బిఆర్ నాయుడు, పాలకమండలి సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. గతంలో ఈవోగా పనిచేసిన అనీల్‌కుమార్ సింఘాల్‌కు ఉన్న అనుభవం భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించడంలో, టిటిడిని అభివృద్ధి దిశగా నడిపించడంలోనూ ఉపయోగపడుతుందని పాలకమండలి సభ్యులు ఆకాంక్షించారు. తిరుమలలో ఈవో క్యాంపు కార్యాలయంలో అనీల్‌కుమార్ సింఘాల్‌ను తిరుపతి మాజీ ఎంఎల్‌ఎ మన్నూరు సుగుణమ్మ,క్లస్టర్ ఇన్‌ఛార్జి శ్రీధర్‌వర్మ, రాష్ట్ర నాయకులు బుల్లెట్ రమణ, కోడూరు బాలసుబ్రమణ్యం, సూరా సుధాకర్‌రెడ్డి, బిజి కృష్ణయాదవ్, మన్యం శ్రీనివాసులు, బిజి ఆనంద్ యాదవ్,రామ్మూర్తి రాయల్, పెరుమాల్ మధు,తిరుమల అధ్యక్ష ప్రధాన కార్యదర్శి రాజుయాదవ్, శివ షణ్ముగం, వెంకీ, ఆనంద్‌బాబు, దేవరాజు సత్కరించారు.

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు, అధికారులు, సిబ్బంది ఆలయ శుద్ధి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ మీడియాతో మాట్లాడుతూ సెప్టెంబరు 24 నుండి అక్టోబరు 02వ తేదీ వరకు శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగనున్నాయని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలు, ఉగాది, ఆణివార ఆస్థానం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆగమానుసారంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఆలయంలోని ఆనందనిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ప్రసాదాల పోటు, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పుతోపాటు పూజాసామగ్రిని శుద్ధి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు, పలువురు బోర్డు సభ్యులు, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, ముఖ్య నిఘా మరియు భద్రతాధికారి మురళీకృష్ణ పాల్గొన్నారు.

తిరుపతిలో జోరువానలో రణభేరి ప్రారంభం

బోధనేతర పనులు వద్దు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

ఉపాధ్యాయులకు బోధనేతర పనులను రద్దు చేయాలని, వారి సమయాన్ని వారి బోధనకే పరిమితం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ డిమాండ్‌చేశారు. యుటిఎఫ్ రాష్ట్రకమిటి నిర్ణయం మేరకు విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తలపెట్టిన రణభేరి ప్రచార బైక్‌జాతా తిరుపతిలో మంగళవారం ఉదయం జోరువానలోనూ ప్రారంభమయ్యింది. రాష్ట్రంలో 13వేలకు పైగా పాఠశాలలు ఏకోపాధ్యాయులతో నడుస్తున్నాయని, ఒక ఉపాధ్యాయుడు ఐదు తరగతులకు బోధన చేయడమే ఇబ్బందిగా ఉన్న పరిస్థితుల్లో, అనేక రకాలైన బోధనేతర కార్యక్రమాలను ఉపాధ్యాయులకు అప్పగించడం దారుణమన్నారు. పాఠశాలకు వెళ్లింది మొదలు వివిధ యాప్‌లతో సమాచారాన్ని అప్‌లోడ్ చేయడంతో పాటు ప్రభుత్వం నుంచి, విద్యాశాఖ అధికారుల నుంచి ఎప్పటికప్పుడు అడుగుతున్న సమాచారాన్ని ఇవ్వడానికే సమయం సరిపోతుందన్నారు. అలాంటపుడు పిల్లలకు నాణ్యమైన విద్య ఎలా లభిస్తుందని ప్రశ్నించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందించేలా ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని డిమాండ్‌చేశారు. యుటిఎఫ్‌రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వం పాఠశాల విద్యలో తీసుకొచ్చిన పాఠశాల విలీనాన్ని రద్దు చేస్తామని చెప్పిన ప్రభుత్వం పాఠశాలల పునర్వ్యవస్థీకరణ పేరుతో ఆరు అంచెలుగా ఉన్న పాఠశాలలను తొమ్మిది రకాలుగా మార్చి విద్యా వ్యవస్థలో గందరగోళాన్ని సృష్టించిందన్నారు. పర్యవసానంగా ఫౌండేషన్ స్కూల్స్ పేరుతో పెద్దమొత్తంలో పాఠశాలలు తక్కువమంది పిల్లలతో, ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారిపోయాయని, భవిష్యత్‌లో మూతబడే ప్రమాదం ఉందన్నారు. విద్యాశాఖ సమీక్షించి ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడటానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల ప్రధాన కార్యదర్శులు ముత్యాలరెడ్డి, మణిగండన్ మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వస్తే మెరుగైనపిఆర్‌సి ఇస్తామని, ఉద్యోగ ఉపాధ్యాయులకు పెండింగ్ ఉన్న ఆర్థికపరమైన అంశాలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి 15 నెలలైనా వాటి గురించి ఎలాంటి పురోగతి లేదన్నారు. ప్రభుత్వం స్పందించి పిఆర్‌సి కమిషన్‌ను నియమించాలని, తాత్కాలికంగా మధ్యంతర భృతిని మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవరాల నిర్మల, జిల్లా గౌరవాధ్యక్షులు దండు రామచంద్రయ్య మాట్లాడుతూ ప్రభుత్వం వద్ద ఇప్పటికి పెండింగ్ లో ఉన్న నాలుగు కరువు భత్యాలను విడుదల చేయాలని, అలాగే సిపిఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్ను పునరుద్ధరించాలని, విద్యా శాఖలో కారుణ్య నియామకాలను పరిష్కరించడానికి ప్రత్యేక చొరవ చూపాలని కోరారు.

ఈ కార్యక్రమంలో నాయకులు వయ్యాల మధు, బండి మధుసూదన్ రెడ్డి, అవనిగడ్డ పద్మజ, మోహన్, చీక్ల సురేష్, హేమాద్రి బాబు, ఎస్ కే భాష, కవిత, ప్రభు కుమార్, మురళి తో పాటు వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

– తిరుపతిలో ప్రారంభమైన రణభేరి ప్రచార జాతా తిరుపతి నుంచి ఏర్పేడు, వెంకటగిరి, శ్రీకాళహస్తి, నాయుడుపేట మీదుగా సూళ్లూరుపేటకు చేరుకుంది. అక్కడినుంచి బస్టాండ్ మీదుగా హోలీక్రాస్ వరకూ బైక్‌ర్యాలీ నిర్వహించారు. తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండల శాఖల నాయకులు పాల్గొన్నారు.

– శ్రీకాళహస్తిలో ఏపీసీడ్స్ కూడలి వద్ద యుటిఎఫ్ జాతాకు శ్రీకాళహస్తి ప్రాంత నాయకులు ఘన స్వాగతం పలికారు. అక్కడనుంచి పుచ్చలపల్లి సుందరయ్య భవన్ వరకూ బైక్‌ర్యాలీన ఇర్వహించారు. ఉమ్మడి సర్వీసు రూల్సు సమస్యకు కూటమి ప్రభుత్వం పరిష్కారం చూపడం లేదని ప్రసాద్ అన్నారు. బదిలీలు, ప్రమోషన్లు పూర్తయ్యి మూణ్ణెల్లు కావొస్తున్నా ఉపాధ్యాయులను పాత స్థానాల్లోనే కొనసాగిస్తున్నారని, మినిమం టైం స్కేలు జీతాలు కూడా ఇవ్వలేదని విమర్శించారు.

చంద్రగిరి విజయనగర కాలనీలో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

తిరుపతిలో భారీ వర్షం

మునిగిన డిఆర్ మహల్ అండర్ బ్రిడ్జి
యుద్ధప్రాతిపదికన పారిశుద్ధ్య పనులు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి నగరంలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకూ భారీ వర్షం కురిసింది. దీంతో నగరంలోని పలు వీధులు జలమయమయ్యాయి. అర్ధరాత్రి ఉరుములు, పిడుగులతో కూడిన వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారు ఇబ్బందులకు గురయ్యారు. ముఖ్యంగా కపిలతీర్థం సమీపంలో ఉండే పలు కాలనీల్లోకి వర్షం నీ రావడంతో మహిళలు ఇంట్లో జాగారం చేయాల్సి వచ్చింది. వర్షం వల్ల డిఆర్ మహల్ అండర్ బ్రిడ్జి, రాయల్ చెరువు రైల్వే అండర్ బ్రిడ్జి పూర్తిగా మునిగిపోవడంతో రాకపోకలను నిలిచిపోయాయి. ఇక్కడ వర్షం నీతో పాటు చెత్తాచెదారంతో అండర్ బ్రిడ్జి మూసుకుపోయింది.మున్సిపల్ కార్పొరేషన్ పారిశుద్ధ అధికారులు యుద్ధ ప్రాతిపదిక చర్యలు చేపట్టడంతో ఈ మార్గంలో మంగళవారం ఉదయం నుంచి రాకపోకలు సాగింది. ముఖ్యంగా ఇంద్ర ప్రియదర్శిని కూరగాయల మార్కెట్, తూడా కార్యాలయం, ఇందిరా మైదానం వాట్సాప్ నీటితో చెరువుల తలపించాయి. లక్ష్మీపురం సర్కిల్ వద్ద వర్షపు నీరు భారీ ఎత్తున చేరిపోవడంతో పారిశుద్ధ కార్మికులు యుద్ధ ప్రాతిపదికంగా తొలగించి వర్షపు నీటిని సజావుగా వెళ్లేందుకు చర్యలు చేపట్టారు. నగరంలో కురిసిన భారీ వర్షాలకు వాతావరణం ఉదయం మొస్తరుగా చల్లబడింది.చంద్రగిరి విజయనగర కాలనీలోనూ రహదారిపైనే నీరు నిలచిపోయి వాహనదారులకు ఇబ్బంది కలిగించింది.

ఎస్వీబీసీ సీఈఓగా ఫణికుమార్ నాయుడు..!

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానం పర్యవేక్షణలో నడుస్తున్న శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానల్(ఎస్వీబీసీ)సీఈఓగా ఫణి కుమార్ నాయుడును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.. గత ప్రభుత్వ హయాంలో ఫారెస్ట్ ఆఫీసర్‌గా షణ్ముగం ఉన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే ఆయనను బదిలీ చేసింది.. ఎస్ వి బి సి ఇన్చార్జి సీఈవోగా తిరుపతి జేఈవో వీరబ్రహ్మం ఇన్ని రోజులు బాధ్యతలు నిర్వహించారు.. రాష్ట్రవ్యాప్తంగా ఫారెస్ట్ ఆఫీసర్ల ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఫారెస్ట్ ఆఫీసర్ ఫణికుమార్‌కు ఎస్వీబీసీ సీఈవోగా పోస్టింగ్ ఇచ్చారు. బుధవారం ఉదయం బాధ్యతలు చేపట్టనున్నారు.



దూర ప్రాంత బస్సులు నిలిపేందుకు బైపాస్ పక్కన స్థల పరిశీలన

బైపాస్‌లో 'బస్‌స్టేషన్'
మూడు ప్రాంతాల్లో పరిశీలన
భూదేవి కాంప్లెక్స్‌లో ఆర్ఎం ఆఫీసు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతి సెంట్రల్ బస్‌స్టేషన్ మోడల్ ఇంటిగ్రేటెడ్ బస్టాండ్‌గా రూపుదిద్దుకోనుంది. ఈ నేపథ్యంలో సెంట్రల్ బస్‌స్టేషన్ మొత్తాన్ని నేలమట్టం చేయనున్నారు. ఆర్ఎం, డిఎం ఆఫీసులనూ కూల్చివేయనున్నారు. ఆర్నెళ్ల తరువాత మోడల్ బస్‌స్టేషన్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేయనున్నారు. మోడల్ బస్‌స్టేషన్ నిర్మించే కాంట్రాక్టర్లు మూడేళ్లలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని తెలుస్తోంది. బస్టాండ్ నేలమట్టం చేస్తుండడంతో బస్సులను నిలిపే స్థలాన్ని, ఆర్ఎం, డిఎం కార్యాలయాలు ఎక్కడెక్కడ పెట్టాలని మూడు ప్రాంతాల్లో పరిశీలించారు. ఈ మేరకు ఆర్టీసీ ఆర్ఎం జగదీష్ జిల్లా కలెక్టర్, టిటిడి ఈవోలకు లేఖలు రాశారు. ఆర్టీసీ ఆర్ఎం, డిఎం కార్యాలయాలకు అలిపిరి వద్ద ఉన్న భూదేవి కాంప్లెక్స్ ఇవ్వాలని కోరినట్లు సమాచారం. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే అంతరాష్ట్ర,రాష్ట్ర బస్సులు నిలిపేందుకు స్థలాలు ఎక్కడా లేకపోవడంతో అగ్రహారం సర్కిల్లో ఉన్న 20 ఎకరాల ఖాళీ స్థలంలో తాత్కాలిక బస్‌స్టేషన్ ఏర్పాటు చేయనున్నారని సమాచారం. ఆఫ్కాన్ కంపెనీ గరుడవారధికి రెడీమేడ్ పిల్లర్లను తయారు చేసిన ప్రాంతంలోనే బస్‌స్టేషన్ రానుంది. బైపాస్, రేణిగుంట, చంద్రగిరి, చెన్నయ్, బెంగుళూరు, గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే బస్సులకు ఈ ప్రాంతం అనువుగా ఉండటం వల్లనే ఈ ప్రాంతాన్ని సెలక్ట్ చేశారని తెలుస్తోంది. బ్రహ్మోత్సవాల తరువాత తాత్కాలిక బస్‌స్టేషన్‌కు ఈ ప్రాంతాన్ని కలెక్టర్ కేటాయించే అవకాశం ఉంది. సిటీకి దూరంగా ఉండడంతో 15 బస్సులను తిరుపతి పురప్రాంతాల నుంచి బైపాస్ బస్‌స్టేషన్‌కు వచ్చేందుకు వీలుగా ఆర్టీసీ యాజమాన్యం నడిపేందుకు చర్యలు తీసుకుంటోంది.

పీజీ విద్యార్థి అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి - క్యాంపస్

ఫీజు బకాయిలతో సంబంధం లేకుండా సర్టిఫికెట్లు, టీసీ ఇవ్వాలని కోరుతూ పీజీ విద్యార్థి ఎస్వీయూ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆఫీసులో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. కూటమి ప్రభుత్వం 6,400 కోట్ల రూపాయల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయకుండా పెండింగ్‌లో ఉంచింది. 2024-25లో పీజీ పూర్తి చేసి, బిఇడి చదవాలనుకున్న విద్యార్థి వినోద్‌కుమార్ తన టీసీ కోసం కళాశాలకు వచ్చాడు. అయితే ఫీజు బకాయి ఉందని కారణం చూపుతూ కాలేజీ అధికారులు టీసీ ఇవ్వడానికి నిరాకరించారు. దీనికి నిరసనగా ఆ విద్యార్థి అర్ధనగ్నంగా ప్రిన్సిపాల్‌కార్యాలయంలో కూర్చుని ఆందోళన వ్యక్తంచేశారు. తన తల్లిదండ్రులు రోజు కూలి పనులు చేసుకునేవారని, ప్రభుత్వం స్కాలర్‌షిప్ ఇస్తుందనే ధీమాతో కర్నూలు నుంచి వచ్చి ఇక్కడ చదివానని, కళాశాలలో చేరేటపుడు అలాట్మెంట్ కాపీలో ఫీజు ప్రభుత్వం ఇస్తుందని అప్పటి అధికారులు తెలిపారన్నారు. తీరా చూస్తే ప్రభుత్వం ఇవ్వలేదని, ఈ కారణం చూపి విద్యార్థుల దగ్గర ముక్కుపిండి వసూలు చేస్తున్నారని వాపోయారు. ఆ సమయంలో అక్కడే పరిశోధన చేస్తున్నఎస్ఎఫ్ఐ నాయకుడు అశోక్‌కుమార్ విద్యార్థికి మద్దతు తెలిపారు. ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడం వల్ల అవమానకర పరిస్థితులు విద్యార్థులకు ఎదురవుతున్నాయన్నారు. ప్రభుత్వం ఇవ్వాల్సిన 6,400 కోట్ల రూపాయల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని డిమాండ్‌చేశారు.

ప్రైవేట్ స్కూల్లో బాంబు బెదిరింపు కలకలం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతిలోని ఓ ప్రైవేటు స్కూల్లో బాంబు బెదిరింపు కలకలం సష్టించింది. పోలీసుల కథనం మేరకు ...తిరుపతి పోలీస్ ఈ మెయిల్ కు కపిలతీర్థం కు అత్యంత చేరువలో ఉన్న అన్నారావు సర్కిల్ సమీపంలోని ఓ ప్రైవేటు స్కూల్లోని తరగతి గదిలో ఆర్డిఎక్స్, ఐబి వంటి బాంబులు ఉన్నట్లు సమాచారం వచ్చింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు సైబర్ ఇన్స్పెక్టర్, వారి సిబ్బంది, బాంబు డిస్పోజల్ టీం ప్రైవేటు స్కూల్ వద్దకు చేరుకొని విద్యార్థులందరినీ బయటకు పంపించారు. తరగతి గదులు, ఉపాధ్యాయుల గది, ప్రధానోపాధ్యాయులకు గది, బాత్రూములు, ఇలా స్కూల్ మొత్తం జల్లెడ పట్టారు. ఎక్కడ ఎలాంటి పేలుడు పదార్థాలు దొరక్కపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇది ఆకతాయిల పని అయి ఉంటుందని భావించి, ఆ దిశగా విచారణ చేపట్టారు.

వృద్ధ మహిళలకు అండగా అఖిలపక్షం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

అతివేగంగా విస్తరిస్తున్న తిరుపతి నగరంలో భూకబ్జాలకు అంతులేకుండా పోతోందని అధికార పార్టీ అండదండలతో, పోలీసులు తోడ్పాటుతో మహిళలు, పేదల స్థలాలే లక్ష్యంగా ఈ కబ్జాలు సాగుతున్నాయని, వీటికి చరమగీతం పాడేందుకు ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉంటామని అఖిలపక్ష నేతలు స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక ఎస్ ఎల్ వి నగర్ లో సంపూర్ణమ్మ స్థలం వద్ద ఆఖిలపక్షం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సిపిఐ, సిపిఎం, వైసీపీ, జనసేన,బిఎస్పి నేతలు పాల్గొని భూకబ్జాలకు వ్యతిరేకంగా జరిగే ఎలాంటి ఉద్యమాలకైనా తాము మద్దతు ఇస్తామని పేర్కొన్నారు. సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, పి.మురళి మాట్లాడుతూ వడమాలపేటకు చెందిన సంపూర్ణమ్మ (40) స్థలాన్ని కాపాడేందుకు ఆమె చేసే పోరాటానికి తాము అండగా ఉంటామన్నారు. గత ఏడాది అఖిలపక్షం అండగా ఉందని, మళ్లీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం పేట్రేగి పోతోందన్నారు. వృద్ధ మహిళకు అండగా నిలిచాడన్న కక్షతో సీనియర్ జర్నలిస్టు సుకుమార్‌పై దొంగతనం కేసులో జైలుకు పంపడం పోలీసుల నిర్వాకానికి పరాకాష్ట అన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి భూపరిరక్షణ కమిటీ కన్వీనర్ గుట్టా నాగరాజు రాయల్, రైతుసంఘం నాయకులు టి.జనార్ధన్, బిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి జె.వేణుగోపాల్‌రాజు, వైసిపి నేత వాసుయాదవ్ పాల్గొన్నారు. కోర్టు ఉత్తర్వులు ఉల్లంగిస్తే తీవ్రంగా పరిణామాలు వుంటాయన్నారు.

పేదల పక్షపాతి బొజ్జాతారకం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి తన జీవితం చివరి వరకూ దళిత, ఆదివాసీ, పేదల సామాజిక మార్పుకోసం కృషిచేసిన పౌరహక్కుల ఉద్యమనేత బొజ్జాతారకం పేదల పక్షపాతి అని వక్తలు ఉద్ఘాటించారు. ప్రముఖ న్యాయవాది బొజ్జా తారకం తొమ్మిదో వర్ధంతి పురస్కరించుకుని మంగళవారం ప్రముఖ కవి గొడుగుచింత గోవిందయ్య అధ్యక్షతన యూత్ హాస్టల్లో వర్ధంతి సభ జరిగింది. రిటైర్డ్ జిల్లా జడ్జి పి.గుర్రప్ప, మరో జిల్లా జడ్జి ఆనంద్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ సాంఘిక సంక్షేమ శాఖ టి.విజయ్‌కుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణ భారత అధ్యక్షులు పి.అంజయ్య, హైకోర్టు న్యాయవాది పి.సంపూర్ణమ్మ పాల్గొన్నారు. తెలుగు రాష్ట్రాల్లో దళిత ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పాలకులు అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. విరసం వ్యవస్థాపక సభ్యులుగా, పౌరహక్కుల సంఘం ఉమ్మడి రాష్ట్రం ఉపాధ్యక్షులుగా, ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ వ్యవస్థాపక అధ్యక్షులుగా, ఎమర్జెన్సీ కాలంలో రెండు సంవత్సరాలు జైలు జీవితం గడపడం ,లక్షలాదిమందిని చైతన్యవంతులను చేసిన చరిత్ర బొజ్జ తారకందన్నారు. రైల్వే రిటైర్డ్ ఉద్యోగి పుష్పరాజ్, టీటీడీ ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు డాక్టర్ ప్రసాద్ రావు, రిపబ్లికన్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఏ.సుబ్రహ్మణ్యం, బొజ్జా తారకం కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

తిరుపతిలో విగ్రహ కలకలం

అధికార విపక్షాల హైడ్రామా
టిటిడి వైఫల్యంపై 'స్వామి' నిరసన

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

తిరుపతి నగరంలో రోడ్డుపక్కన పడి ఉన్న ఓ దేవుడి విగ్రహం కలకలం రేపి, రాజకీయ హైడ్రామాగా మంగళవారం చర్చనీయాంశం అయ్యింది. సనాతన ధర్మానికి తామే ప్రతినిధులు అన్నట్టు అధికార, ప్రతిపక్ష పార్టీలు ఇరువురూ ఒకరిపై ఒకరు విమర్శల తూటాలు వదులుకున్నారు. దీంతో సున్నితమైన అంశం ఎక్కడ పెద్దదిగా మారుతుందోనని పోలీసులు పరుగులు తీశారు. తీరా ఆ విగ్రహం ఓ శిల్పి చెక్కుతూ సరిగ్గా రాకపోవడంతో పక్కన పడేశారని సమాచారం. అది విష్ణువిగ్రహం కాదని, శనీశ్వర విగ్రహమని టిటిడి పేర్కొంది. అయినా విగ్రహాలను రోడ్డు పక్కన పడేయడం ఏంటని టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ధ్వజమెత్తారు. టిటిడి వైఫల్యంపై అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర స్వామి నిరసన తెలిపారు.

తిరుమలకు వెళ్లే వాహనాల తనిఖీలు నిర్వహించే పాత చెక్‌పోస్టు, భూదేవి కాంప్లెక్స్‌కు ఎదురుగా, ప్రైవేటు వాహనాలు పార్కింగ్ చేసే ప్రాంతంలో పది అడుగులు ఎత్తు గల భారీ రాతి విగ్రహం వుంది. మహావిష్ణు రూపంగల ఆ విగ్రహాన్ని టిటిడి పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తూ మలమూత్రాలు విసర్జించే ప్రాంతంలో పడేసిందని, ఆకతాయిలు ఆ విగ్రహం వద్ద మద్య, దూమ పానం చేస్తూ అపవిత్రం చేస్తున్నారని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి మంగళవారం వేకువ జామున ఆ ప్రాంతాన్ని సందర్శించి విమర్శలు చేశారు. ఆ విగ్రహానికి పూజలు చేసి దేవుడా నువ్వే కాపాడాలంటూ వేడుకున్నారు. మరికొన్ని గంటల్లో తిరుమల అన్నమయ్య భవన్లో పాలకమండలి సమావేశం జరగనుండడంతో ఘటన మరింత దుమారం రేపింది. వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా ఈ ఘటన విస్తతంగా ప్రచారం కావడంతో టిటిడి అధికారులు ఆ విగ్రహం వద్దకు పరుగులు తీశారు. అలిపిరి సిఐ ఆధ్వర్యంలో పోలీసులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. డీఎస్పీ భక్తవత్సలం, ఏఎస్‌పి రవి మనోహరచారి అక్కడికి చేరుకుని విగ్రహాన్ని పరిశీలించారు. ఎట్టకేలకు టిటిడి అధికారులు ఆ విగ్రహానికి తమకూ ఏ సంబంధం లేదని, పక్కనే ఉన్న శిల్పకళాశాల అధికారులు కూడా అక్కడికి చేరుకొని ఇది తమది కాదని తేల్చారు. దీంతో తిరుమలలో సభ్యులు హుటాహుటిన మీడియా సమావేశం ఏర్పాటు చేసి, గత పది సంవత్సరాలుగా ఆ విగ్రహం అక్కడే ఉందని, ప్రతిపక్షం కావాలనే తమపై విమర్శలు గుప్పిస్తున్నాయని ఆరోపించారు. అలిపిరి పాత చెక్‌పోస్టు పక్కన వివాదానికి కారణమైన ఆ పది అడుగుల విగ్రహం వాస్తవానికి శ్రీ మహావిష్ణువు కాదని, శనీశ్వర స్వామిదని నిర్ధారణ అయ్యింది. ఏ దేవుని విగ్రహమైనా రోడ్డుపక్కన పడి ఉన్న విగ్రహాన్ని టిటిడి వేరే ప్రాంతానికి తరలించి ఉంటే ఈ ఆందోళనలు చేయాల్సి వచ్చేది కాదని విపక్షాలు పేర్కొంటున్నాయి.

విజయ శంకర స్వామి నిరసన

మహావిష్ణు విగ్రహమో, శనీశ్వర విగ్రహమో ఏదైనా సరే శ్రీవారి పాదాల చెంత అనాధగా పడేయడం అపచారం అంటూ తిరుపతి అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయ శంకర స్వామి విగ్రహం వద్ద శాంతియుతంగా మంగళవారం నిరసనకు దిగారు. మంగళవారం టిటిడి పాలకమండలి ఉండడంతో అలిపిరి పోలీసులు స్వామిని అదుపులోకి తీసుకుని మధ్యాహ్నం 3 గంటలకు సొంతపూచీకత్తుపై విడుదల చేశారు. టిటిడి జోక్యం చేసుకుని విగ్రహాన్ని వేరే చోటకు తరలించి భద్రపరచాలని 'స్వామి' డిమాండ్ చేశారు.

విగ్రహాలను ఎక్కడబడితే అక్కడ ఉంచొద్దంటూ స్వామి నిరసన

గంటసేపు ఆగిన పినాకిని ఎక్స్‌ప్రెస్

ప్రజాశక్తి -దొరవారిసత్రం: దొరవారిసత్రం మండలం కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో, పినాకిని ఎక్స్‌ప్రెస్ రైలు సుమారు గంట సేపు ఆగింది. విజయవాడ నుండి చెన్నై వెళ్లే ఈ రైలు, సూళ్లూరుపేట ప్రాంతంలో రైలు పట్టాల మరమ్మతులు జరుగుతుండడంతో ఆగినట్లు అధికారులు తెలిపారు. దీంతో ప్రయాణీకులు అసహనానికి గురయ్యారు.

వాహన మిత్రకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: సొంత వాహనం కలిగి ఉండి బాడుగలకు నడుపుతున్న డ్రైవర్లు, సంవత్సరానికి 15000 రూపాయలు ఆర్థిక సహాయం పొందేందుకు అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని బుచ్చినాయుడు కండ్రిగ మండల అధ్యక్షులు సుధాకర్ నాయుడు తెలిపారు. తగు పత్రాలను గ్రామ సచివాలయంలో 19వ తేదీ లోపు సమర్పించాలన్నారు.

తిరుమూరు మురళికి ఘన సన్మానం

ప్రజాశక్తి -కోట: కోట మండలం, కొత్తపట్నం పంచాయతీకి చెందిన కోట మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు తిరుమూరు మురళిని గూడూరు, టిడిపి పార్టీ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. కోట టిడిపి నాయకులు, పొదుపు సంఘ సభ్యులు మురళిని పూలమాలు, శాలువా వేసి అభినందించారు. టిడిపి బలోపేతానికి తిరుమూరు మురళి కృషి చేస్తున్నారని స్థానిక టిడిపి నాయకులు కొనియాడారు. రానున్న రోజుల్లో పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేసి ఉన్నత పదవికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోట మండల పార్టీ అధ్యక్షులు పలగాటి భాస్కర్ రెడ్డి, నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి, తిరుపతి పార్లమెంట్ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్, బండిల రఘురామయ్య, నెల్లూరు మోహన్ రెడ్డి, కోళ్ల మధు యాదవ్, షేక్ మస్తాన్ భాష, దారా సురేష్, కోట వెలుగు కార్యాలయం ఏపిఎం అనిల్, తదితర పొదుపు సభ్యులు పాల్గొన్నారు.

పోటా పోటీగా కబడ్డీ.. జట్లు ఎంపిక

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక పుత్తూరు ఎస్ఆర్ఎస్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహించిన మండల స్థాయి ఎస్‌జిఎఫ్ కబడ్డీ జట్ల ఎంపిక పోటీలలో సీనియర్ బాలుర విభాగంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తమిళ్ పుత్తూరు విన్నర్‌గా, వేద వ్యాస హై స్కూల్ రన్నర్‌గా, సీనియర్ బాలికల విభాగంలో గేట్ పుత్తూరు హై స్కూల్ విన్నర్‌గా, పిల్లారిపట్టు హై స్కూల్ రన్నర్‌గా, జూనియర్ బాలుర విభాగంలో గేట్ పుత్తూరు హై స్కూల్ విన్నర్‌గా, పిల్లారిపట్టు హై స్కూల్ రన్నర్‌గా, జూనియర్ బాలికల విభాగంలో కెబీఆర్ పురం హైస్కూల్ విన్నర్‌గా, నారాయణ హై స్కూల్ రన్నర్సుగాను నిలిచాయి. ఈ క్రీడా పోటీలను మండల కోఆర్డినేటర్ ఏ గోపీకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు జయప్రకాష్, గుర్రప్ప, కేశవులు, సుబ్రహ్మణ్యం, ఏకే వేలు, మోహన్, షంషుద్దీన్, ఆరుముగం, రాజశేఖర్, రేఖా రాణి, గోవిందమ్మల ఆధ్వర్యంలో నిర్వహించారు.

150 రోజుల్లో పూర్తికానున్న డీఎస్సీ ప్రక్రియ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): డిఎస్సీ ద్వారా 16,347 మందికి ఉద్యోగాలు కల్పించిన మంత్రి నారా లోకేష్‌కు థాంక్స్ చైర్మన్ రవినాయుడు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ వేదికగా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం 150 రోజులలో డీఎస్సీ ప్రక్రియ పూర్తి చేసి నియామకపు ఉత్తర్వులను ఈ నెల 19న అమరావతి వేదికగా అర్హత సాధించిన అందరికీ అందించనున్నారని తెలిపారు. 40 ఏళ్లుగా క్రీడలకు సంబంధించి పాఠశాలల్లో నియామకాలు జరగపోవడంతో పీఈటీ పోస్టుల కోసం ... రిజర్వేషన్ తో 421 పోస్టులు భర్తీ చేశారని తెలిపారు. భూమన కరుణాకర్ రెడ్డి టీటీడీ పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆయనపై కేసు నమోదు చేయాల్సి ఉందని అభిప్రాయపడ్డారు.

ఘనంగా తిరుపతి రూరల్ ఎస్జీఎఫ్ క్రీడా పోటీలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి రూరల్ మండలం, మంగళం (టౌన్) ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కేశవులు నాయుడు ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు మురళి రాజశేఖర్ ఆధ్వర్యంలో తిరుపతి రూరల్ మండలం ఎస్జీఎఫ్ క్రీడా పోటీలను మంగళవారం నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో భాగంగా కబడ్డీ, ఖో. ఖో, యోగా అండర్ 14, 17 బాల బాలికల టోర్నమెంట్ ఎంపిక పోటీలు నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 300 మంది ఉత్సాహంగా పాల్గొని డివిజనల్ స్థాయిలో నిర్వహించే పోటీలకు ఎంపిక అయ్యారన్నారు. ఈ పోటీలు తిరుపతి రూరల్ మండల కోఆర్డినేటర్ సాంబశివరావు, ఆర్గనైజేషన్ సెక్రెటరీలు సురేష్, రూపలత ఆధ్వర్యంలో జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం రెడ్డి, నందకుమార్, కుమారి, గణేష్, వరలక్ష్మి, పద్మప్ప, విజయ, పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి చేయాలి

ప్రజాశక్తి - నాయుడుపేట: సూళ్లూరుపేట నియోజకవర్గ పరిధిలో నూతనంగా నియమితులైన వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు, డైరెక్టర్లు రైతు సంక్షేమానికి కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ సూచించారు. మంగళవారం నాయుడుపేట, శ్రీనివాస కళ్యాణ మండపంలో వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్ల ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం ద్వారా విద్యుత్తు సబ్సిడీ యూరియా, ఎరువులు, విత్తనాలను అర్హులైన రైతులకు అందించి వారి ఆదాయ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్సీఎస్టీ చైర్మన్ మెట్టుకూరు ధనంజయ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. అనంతరం పలువురు సహకార సంఘాల చైర్మన్లు, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, ఏఎంసీ చైర్మన్ సూళ్లూరుపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి ఉయ్యాల ప్రవీణ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి మహిళకూ ఐద్వా అండ

ప్రజాశక్తి -రేణిగుంట: ప్రతి మహిళకూ ఐద్వా అండగా ఉంటుందని, గృహ, రాజకీయ హింస, లైంగిక దాడి, భూహక్కుల కోసం పోరాటం, కుల, మత వివక్షకు వ్యతిరేకంగా మహిళా సంఘం పోరాడుతుందని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సాయిలక్ష్మి అన్నారు. రేణిగుంట జిఎం వీధిలోని పుట్టపర్తి సుందరయ్య భవన్‌లో మంగళవారం ఐద్వా అధ్యక్షతన సమావేశం జరిగింది. మహిళా సమస్యలపై ప్రతి ఒక్కరూ ఒక కాలికట్టై పోరాటాలు చేసి, హక్కులను దక్కించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ, సత్యశ్రీ, ఈశ్వరమ్మ, భారతి, ధనమ్మ, శిరీష, అమ్ములు, సూర్యహాసిని, శాంతి, కుమారి, లావణ్య, హైమావతి, సుప్రజ, మహాలక్ష్మమ్మ పాల్గొన్నారు.

పన్నులు చెల్లిస్తున్నా.. పలకరే..!

■ అనధికార లేఅవుట్లలో తప్పని తిప్పలు ■ మౌలిక వసతులు మృగ్యం ■ పన్నులు చెల్లించినా ఫలితం లేదు ■ నిర్మాణాలు చేపట్టాలంటే సొంత ఖర్చు అదనం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నగరి నియోజకవర్గంలో పుత్తూరు, నగరి జంట మున్సిపాలిటీలున్నాయి. పుత్తూరు జనాభా 55 వేలు. సుమారు 13500 నివాసాలున్నాయి. నగరి జనాభా 65 వేలు. 14 వేల పై చిలుకు నివాసాలున్నాయి. వీటిలో ఏటా సుమారు 200 కుటుంబాలు అదనంగా చేరుతున్నాయి. భవన నిర్మాణాలకు అనుమతి పారదర్శకంగా ఇవ్వాలని గత ప్రభుత్వ హయాంలో ఆన్లైన్లోనే అన్ని ప్రక్రియలు పూర్తి చేసి వివరాలు పంపితే అనుమతి కోసం ఎంత చెల్లించాలో ఆన్లైన్లోనే దరఖాస్తు దారునికి వస్తుంది. మీ-సేవలో పైకం చెల్లించిన వెంటనే అనుమతులు వస్తున్నాయి. కొంత ఆలస్యం అయినా పారదర్శకంగా ఉంది. ఇక్కడే ఉంది తిరకాసు, అనధికార లేఔట్లలో భవన యజమాని నుంచి 19 శాతం పన్ను వసూలు చేసిన నేపథ్యంలో అక్కడ మౌలిక వసతులు కల్పించాలి. అయితే ఏళ్లు గడుస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు.

ప్లాట్లు కొన్నవారికి.. తప్పనిపాట్లు

అనధికార లేఔట్లులలో ప్లాట్లు కొన్న ప్రజలకు పాట్లు తప్పడంలేదు. ఈ లేఔట్లులలో భవన నిర్మాణానికి అనుతులు తీసుకోవాలంటే అందులో అభివృద్ధి కోసం మున్సిపల్ శాఖకు 2006కు ముందుకు డాక్యుమెంట్ అయితే ఆ విలువలో 14శాతం చెల్లించాలి. అనంతరం రిజిస్ట్రేషన్లు అయితే అదనంగా మరో 5 శాతం కలిపి 19 శాతం చెల్లించాల్సి ఉంటుంది. దీనికి తోడు పీనలైజేషన్ ఛార్జీ అదనం. ఈ లెక్కన యేటా కోట్లాగి రూపాయలు మున్సిపల్ ఖజానాకు ఆదాయం వస్తోంది. అయితే భవన

నిర్మాణ అనుమతులు తీసుకున్నాక అక్కడ ఇళ్లు నిర్మించుకోవాలంటే బోరు తప్పనిసరిగా వేసుకోవాలి. దానికి విద్యుత్తు కనెక్షన్ తీసుకోవాలి. అయితే ఆ వీధిలో విద్యుత్తు పోల్స్ లేకుంటే మున్సిపాలిటీ విద్యుత్తు శాఖకు దానికయ్యే మొత్తాన్ని చెల్లించి విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేయాలి. అయితే మున్సిపల్ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

చేతి చమురు వదిలించుకోవాల్సిందే

అటు మున్సిపాలిటీకి అభివృద్ధికి సహకరిస్తున్నా.. ఇటు విద్యుత్తుశాఖ పోల్స్ ఏర్పాటు చేయడానికి ఫీజులు చెల్లించాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. మున్సిపాలిటీల్లో సుమారు 45 అనధికార లేఔట్లు ఉన్నాయి. రెండింటికి మాత్రమే తుడా అనుమతి ఉంది. మున్సిపాలిటీ అయ్యాక కూడా అనధికార లేఔట్లు వేసి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. అందులో ప్లాట్లు కొన్న వారు నేడు అవస్థల నడుమ ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు.

దశలవారీగా వసతులు కల్పిస్తున్నాం

మున్సిపాలిటీల్లోని కొత్త కాలనీల్లో దశలవారీగా వసతులు కల్పిస్తున్నాం. అయితే ప్రస్తుతం వసూళ్లవుతున్న పన్నులతో, జీతభత్యాలు, నిర్వహణ ఖర్చులతో పాటు అభివృద్ధి పనులు చేపడుతున్నాం. భవన అనుమతులు కోసం వచ్చిన నగదును అన్ని వార్డుల్లో అభివృద్ధికి ఉపయోగిస్తున్నాం.

-మంజునాథ గౌడ్, మున్సిపల్ కమిషనర్, పుత్తూరు.

ఘనంగా స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ క్రీడల పోటీలు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో విద్యార్థులు క్రీడల్లో రాణించి జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలని ప్రధానోపాధ్యాయులు రమణయ్య ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయి క్రీడాకారులను ఎన్నుకోవడానికి ఈ పోటీలు ఉపయోగపడతాయన్నారు. ఈ పోటీలలో పల్లమాల, బుచ్చినాయుడు కండ్రిగ, నెలవాయి, కల్లివెట్టు, చల్ల మంబాపురం జిల్లా పరిషత్ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. మండల అభివృద్ధి అధికారిణి మోతి పోటీలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ఇన్చార్జ్ సుధాకర్ నాయుడు, మండల విద్యాశాఖ అధికారులు రవీంద్రనాథ్, ముని సుబ్రమణ్యం, నెలవాయి ప్రధానోపాధ్యాయులు హరిప్రియ, పల్లమాల ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి, వ్యాయామ ఉపాధ్యాయులు మస్తానయ్య, హరిబాబు, ఐదు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు ధనుంజయులు, పాఠశాల ఇన్చార్జి శ్రీనివాసులు, తెలుగు ఉపాధ్యాయులు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మానవాళికి రక్షణ కవచం 'ఓజోన్' పొర

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మానవులను క్యాన్సర్, కంటిచూపు లోపం మొదలైన ప్రమాదకరమైన జబ్బుల నుండి ఓజోన్ పొర కాపాడుతుందని డాక్టర్ బి. కోటేశ్వరయ్య తెలిపారు. మంగళవారం ప్రపంచ ఓజోన్ దినోత్సవ సందర్భంగా పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఓజోన్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హరిబాబు, డాక్టర్ సామ్ సన్ రాజు, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సుజన, డాక్టర్ వెంకట కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి, ఏపీ పొల్యూషన్ బోర్డ్ ఆధ్వర్యంలో ప్రపంచ ఓజోన్ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. బివికే గ్రూప్స్ ఆఫ్ ఇన్స్టిట్యూట్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పర్యావరణ ఇంజనీర్ రాజశేఖర్ మాట్లాడుతూ ఓజోన్ పొర ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య చిల్డ్రన్స్ అకాడమీ డైరెక్టర్ అలేఖ్య, ప్రధానోపాధ్యాయులు హరి, మదన్మోహన్ రెడ్డి, శశికళ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల అమ్మకాలలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో వ్యవసాయ శాఖ తరపున ఎరువులు, పురుగు మందులు, విత్తనాల డీలర్స్‌కు, శ్రీకాళహస్తి ఎడిఎ రమేష్ రెడ్డి, బిఎన్ కండ్రిగ మండల వ్యవసాయధికారి షణ్ముగం సమక్షంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎరువుల అమ్మకాలలో ఎలాంటి తప్పులు చేయకూడదని, ఎరువులు నిల్వ, గ్రౌండ్ బాలన్స్, రిజిస్టర్ బాలన్స్, ఈపాస్ మెషిన్ బాలన్స్ ఈక్వల్‌గా ఉండాలని తెలియజేశారు. తేడా ఉంటే లైసెన్సు రద్దు, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

యూరియా అధిక రేట్లకు అమ్మితే కఠిన చర్యలు

ప్రజాశక్తి -కోట : రైతులకు యూరియాను అధిక రేట్లతో అమ్మితే సంబంధిత డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ ఏవో ఎన్.రామాంజనేయరెడ్డి హెచ్చరించారు. మంగళవారం కోట మండలంలోని బాలాజీ ఫర్టిలైజర్స్‌ను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ హెడ్ కానిస్టేబుల్ వెంకటాద్రి, ఏ ఓ సుచేంద్ర ప్రసాద్, విఏఏ సాయి పాల్గొన్నారు.

మండల స్థాయి స్కూల్ గేమ్స్ విజేతలుగా వడమాలపేట విద్యార్థులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: వడమాల పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆటస్థల వేదికగా, మండల స్థాయి పాఠశాల క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో అండర్ 14, 17బాలబాలికలకు మండల విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలో వాలీబాల్, కబడ్డీ పోటీలు మంగళవారం నిర్వహించారు. అండర్ 14, 17 బాల బాలికలు వాలీబాల్, కబడ్డీలో వడమాలపేట విద్యార్థులు విజేతలు కాగా, తడుకు ఉన్నత పాఠశాల, ఎస్బిఆర్ పురం ఉన్నత పాఠశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. వారిలో మండల జట్టును ఎంపిక చేశారు. ఈ జట్లు డివిజన్ స్థాయి పోటీలలో వడమాలపేట తరపున పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో వడమాలపేట మండల విద్యాశాఖ అధికారులు పద్మావతమ్మ, తులసీరామ్, కరుణా నవనీతం, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - నాయుడుపేట: తిరుపతి జిల్లా, గూడూరు, గాంధీ నగర్‌లో మంగళవారం ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ దక్షిణ భారతదేశ పౌర హక్కుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ఫౌండర్ చైర్మన్ పౌరహక్కుల నేత హైకోర్టు న్యాయవాది ఏఎంబి డా. సురేష్ కుమార్, ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా మావుళ్ళపాటి మహేష్‌ని నియమించారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ విద్యావంతుడు, గతంలో అనేక సంఘాలలో, జిల్లాస్థాయి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా బాధ్యతలు నిర్వర్తించిన మహేష్ ఈ పదవికి అర్హుడని తెలిపారు. బలహీన వర్గాల హక్కులను పరిరక్షించే విషయంలో మహేష్ ఉత్తమ సేవలు అందిస్తారన్నారు. అనంతరం మావుళ్ళపాటి మహేష్ చైర్మన్ సురేష్ కుమార్‌కి, వారి బృందానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ దక్షిణ భారతదేశ ప్రెసిడెంట్ సాల్మన్ రాజ్, రాష్ట్ర కమిటీ సభ్యులు చంద్రశేఖర్, భాషా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామలో ఏఐపై అభ్యాసం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీరామ్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళ వారం సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యం లో సివిల్ ఇంజనీరింగ్ లో కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషి యల్ ఇంటెలిజెన్స్), యంత్ర అభ్యాసం (మిషన్ లర్నింగ్) అనే అంశాలపై విద్యార్థులకు నిపుణులచే ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పుత్తూరు సిద్ధార్థ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ అకాడమిక్ డీన్ ప్రొఫెసర్ సి. శివకుమార్ ప్రసాద్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సివిల్ ఇంజనీరింగ్ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తుందని విద్యార్థులకు వివరించారు. ఏఐ, ఎమ్మెల్ ఆధారిత సాఫ్ట్ వేర్ లు నిర్మాణ రంగంలో రూపకల్పన, అంచనా, ప్రణాళిక, అమలు విధానాలను ఎలా మెరుగు పరుస్తాయో విద్యార్థులకు విశదీకరించారు. అధునాతన సాఫ్ట్ వేర్ లను ఉపయోగించుకొని విద్యార్థులు ఉన్నత స్థితికి ఎదగాలనికళాశాల చైర్మన్ మన్నెం రామి రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్ రెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ వాసు సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ సివిల్ విభాగాధిపతి డాక్టర్ బాలకష్ణ భరత్ పాల్గొన్నారు.

ఘనంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో ఆవరణలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు మనోహరం పాల్గొని జండా వందనం చేశారు. ఆయన మాట్లాడుతూ సమస్యలపై నిస్వార్థంగా పోరాడుతున్న స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్‌ను బలపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఎస్‌డబ్ల్యూఎఫ్ సెక్రెటరీ శేఖర్, ప్రెసిడెంట్ సాల్మన్, డిపో గ్యారేజ్ సెక్రటరీ కే.ఎస్. మన్యం, శ్యాముల్, డిపో కమిటీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ఆర్టీసీ డిపోలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సి.ఐ.టి.యు) అనుబంధం ఆధ్వర్యంలో మంగళవారం 47వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఫెడరేషన్ జెండాను స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా గౌరవా ధ్యక్షులు కామ్రేడ్ మల్లికార్జున ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం స్త్రీశక్తి పథకం ప్రారంభమవడంతో, కొత్త బస్సులు లేకపోవడం, సిబ్బంది కొరత, ఉద్యోగులపై పనిభారం పెరిగిందన్నారు. ఫెడరేషన్ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ ఆర్టీసీలో ఎన్ని సంఘాలున్నా ఎన్ని జండాలున్నా అజండా మాత్రం ఒకటే ఉండాలన్నారు. డిపో మేనేజర్ పి.సిహెచ్.లక్ష్మి డిపో గ్యారేజ్ ముందు పూల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎస్.డబ్ల్యూ.ఎఫ్ తిరుపతి రీజినల్ గౌరవాధ్యక్షులు డి.మల్లికార్జున్, సీనియర్ నాయకులు ఏం.శేషయ్య, కె.నారాయణ, కె.ఎస్.వాసులు తదితరులు పాల్గొన్నారు.

హనుమయ్య జెండా పండుగ ప్రశాంతంగా జరుపుకోవాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఆంజనేయ స్వామి జెండా పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని గూడూరు రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ సూచించారు. రెండో పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళ వారం జెండా పండుగ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జెండా పండుగ నిర్వహించదలచిన ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పోలీస్ అనుమతి పొందాలన్నారు. డీజే, బాణసంచాకు అనుమతి లేదన్నారు. ఊరేగింపులో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. ఊరేగింపును సమయానికి ప్రారంభించి, సమయానికి ముగించాలన్నారు. విద్యుత్ వైర్లు, చెట్టు కొమ్మలు మొదలైన వాటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, సాధారణ ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. ఆంజనేయ స్వామి భక్త కమిటీ సభ్యులు శాంతి భద్రతలకు పూర్తి బాధ్యత వహించాలన్నారు. ఊరేగింపు సందర్భంగా గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించండి : ఐద్వా

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: మంగళవారం అఖిల భారత మహిళా సంఘం ఐద్వా వెంకటగిరి మండల ప్రథమ మహాసభ పెట్లూరులో నిర్వహించారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా అఖిల భారత మహిళా సంఘం ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి సాయి లక్ష్మి పాల్గొని ప్రసంగించారు. ఆమె మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించాలని, గ్రామీణ ఉపాధి చట్టాన్ని సక్రమంగా అమలు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. చదువుకున్న యువతలకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఆదుకోవాలన్నారు. మహిళల సమానత్వ సాధనకు, ప్రజాస్వామ్య హక్కులను కాపాడేందుకు మహిళా ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. మహిళల మీద జరుగుతున్న లైంగిక వేధింపుల్ని అరికట్టాలన్నారు. మహిళల హింసకు సంబంధించి కేసులు నమోదు అవుతున్న ఎలాంటి శిక్షలు పడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్టేషన్ కోస్తున్న ఫిర్యాదుల్లో 10 శాతం కూడా ఎఫ్ఐఆర్లు నమోదు కావడం లేదని ఆరోపించారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో ఉద్యమాలను చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం అఖిల భారత మహిళా సంఘం ఐద్వా వెంకటగిరి మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. వెంకటగిరి మండల అఖిల భారత మహిళా సంఘం నూతన కమిటీ అధ్యక్షులు లక్ష్మి, ఉపాధ్యక్షులు ధనలక్ష్మి, రత్నమ్మ, సహాయ కార్యదర్శులుగా వెంకమ్మ, మమత సభ్యులుగా దేశమ్మ, గీత, రాజమ్మ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా భీమాల భాస్కర్ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు): తొట్టంబేడు మండలం, తంగేళ్ల పాలెం వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ప్రమాణస్వీకార మహోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం చైర్మన్‌గా భీమాల భాస్కర్ ముదిరాజ్, సభ్యులుగా ధనంజయులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన చైర్మన్ మాట్లాడుతూ టీడీపీ కోసం అంకితభావంతో పనిచేసిన తనకు అవకాశం కల్పించినందుకు ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శులు గాలి చలపతి నాయుడు, దశరదాచారి, పార్టీ పరిశీలకులు అంకయ్య చౌదరి, శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెంచయ్య నాయుడు, టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఉమేష్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్షతో పాటుగా రూ.6 లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి మంగళవారం తీర్పు వెలువరించారని టాస్క్ ఫోర్స్ అధికారులు తెలిపారు. క్రైమ్ నెంబర్ 28/2016 కేసులో సదరు ముద్దాయి తిరుపతి జిల్లా నాగపట్ల వెస్ట్ బీట్, చీకిమానుకోన పరిధిలో ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ అరెస్టయ్యాడన్నారు. ఈ వ్యక్తి తమిళనాడు, విల్లుపురంకు చెందిన ఎల్.సేతు, కాగా ఇతని నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ స్మగ్లరుకు శిక్షను విధించారన్నారు. కోర్టు ఆదేశాలు మేరకు స్మగ్లర్ ను నెల్లూరు సెంట్రల్ జైలుకు పంపారు. సహజ సంపద ఎర్రచందనం చెట్లను నరికి అక్రమ రవాణా చేయడం, అడవిలోకి అక్రమంగా ప్రవేశించే నేరస్తులకు ఇది ఒక హెచ్చరికగా పరిగణించబడుతుందని టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ.శ్రీనివాస్ తెలిపారు.

క్రైం న్యూస్

ఆటో బోల్తా.. ఆరుగురికి గాయాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఆటో బోల్తా పడి ఆరుగురు తీవ్రంగా గాయపడ్డ సంఘటన మంగళవారం పట్టణంలోని భరద్వాజ తీర్థం వద్ద చోటు చేసుకుంది. నెల్లూరుకు చెందిన ఆశా కుటుంబం పట్టణంలోని బంధువుల ఇంటికి జన్మదిన వేడుకలు కోసం వచ్చారు. జన్మదిన వేడుకల అనంతరం లోబావి (భరద్వాజతీర్థం) సందర్శించి తిరుగు ప్రయాణం అయ్యారు. ఇంతలో ఆటో అదుపు తప్పడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో రెహనా (50), కరిష్మా (22), భాను (23), జాకీర్ (23), ఆశా బేగం (65), మహమ్మద్ అలీ (8)లు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

సైబర్ వలకు చిక్కిన యోగా మాస్టర్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: సైబర్ నేరగాళ్ల వలకు తిరుపతికి చెందిన యోగ మాస్టర్ చిక్కడంతో 12 లక్షల రూపాయలు నగదును కాజేశారు. పోలీసుల కథనం మేరకు పేరూరులో నివాసముంటున్న యోగా టీచర్ కు వాట్సప్ ద్వారా హేమాంగి డేట్ అనే వ్యక్తి లింకును పంపారు. ప్రముఖ ఐసిఐసిఐ సెక్యూరిటీ పేరుతో గల నకిలీ ట్రేడింగ్ యాప్ లో ఇన్వెస్ట్ చేయమని ప్రలోభ పెట్టారు. ఇన్వెస్ట్ చేసిన కొంతకాలానికి లాభాలు చూపించి, విత్ డ్రా చేసుకోవాలంటే 20శాతం కమిషన్ ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. అనుమానం వచ్చిన బాధితుడు ఐసీఐసీ బ్యాంకును సంప్రదించగా ఆ యాప్ ఫేక్ అని తెలుసుకున్నాడు. సైబర్ క్రైమ్ 1930కు కాల్ చేసి తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఇద్దరు చిన్నారుల మృతదేహాలు లభ్యం

ప్రజాశక్తి-పాకాల: తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం, పాకాల మండలం గాదంకి టోల్ ప్లాజా సమీపంలోని అడవిలో ఈ నెల 14న బయటపడిన మృతదేహాల ఘటనపై. పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు . ఇందులో భాగంగా మంగళవారం మరో రెండు చిన్నపిల్లల మతదేహాలు గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. గాదంకి టోల్‌ప్లాజా సమీపంలోని అడవిలో రెండు మృతదేహాలను ఈనెల 14వ తేదీ పోలీసులు గుర్తించారు .మతదేహాల పక్కనే రెండు గోతులు తీసి ఉండటాన్ని గమనించిన పోలీసులు. చిన్నారుల మృతదేహాలు రెండు గోతుల్లో ఉన్నట్లు అనుమానించి వాటిని తవ్వి చూడగా వారి అనుమానం నిజమైంది. చిన్నారుల మృతదేహాలను వెలికి తీసి పోస్టుమార్టం నిర్వహించారు. చనిపోయిన మహిళ తన భార్య అంటూ తమిళనాడుకు చెందిన వెంకటేష్ అనే వ్యక్తి పాకాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమిళనాడులోని తిట్టచ్చేరి పోలీసుస్టేషన్‌లో ఇప్పటికే ఫిర్యాదు చేసినట్లు వెంకటేష్.తెలిపారు .హత్యలకు వివాహేతర సంబంధమే కారణమని. పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మొదట ఆత్మహత్యగా భావించిన పోలీసులు ఆ తరువాత హత్య జరిగి ఉండొచ్చునని అనుమానం వ్యక్తం చేశారు.కేసు దర్యాప్తు చేస్తున్నారు. వాస్తవాలు పోలీసులు విచారణలో తేలాల్సి ఉంది.

ప్లాస్టిక్ వాడకంపై తనిఖీలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: మున్సిపల్ కమిషనర్ మంజునాథ గౌడ్ ఆదేశాల మేరకు మంగళవారం మున్సిపల్ అధికారులు, సచివాలయం సిబ్బంది హోటళ్లు, రెస్టారెంట్లలో పరిశీలించారు. ప్లాస్టిక్ వినియోగంపై తనిఖీలు నిర్వహించారు. ఈ మేరకు అర్ధ ఫాస్ట్ ఫుడ్, బిగ్ ఫాస్ట్ ఫుడ్స్, కె.బి.బిర్యానీ పాయింట్, మా రెస్టారెంట్ల యాజమాన్యానికి, ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ వినియోగించినందుకు గాను జరిమానా విధించారు. వారు మాట్లాడుతూ ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ నిషేధించడం జరిగిందని, అవి వినియోగిస్తే జరిమానాలతోపాటు ట్రేడ్ లైసెన్స్ రద్దు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

BEFORE THE HON'BLE DISTRICT CONSUMER DISPUT REDRESSAL COMMISION - 2, TIRUPATI
C.C.No. 45 of 2025
V. Narmada ... Complainant
Vs.
The Authorized Person Samsung India & 2 others ...Opposite Parties
NOTICE TO OPPOSITE PARTIE NO. 2
To
The authorized person, SAMSUNG INDIA, having its regional office at D.No. 8-616/I, Plot No.5, Ishita Towers, Opp. ICICI Bank, AIR Bypass Road, Tirupati, Tirupati District.
Sir
Please take notice that the Complainant filed the above Complaint against you and the same is posted for your appearance. So, you are hereby called upon to appear before the Hon'ble Court on 03-10-2025 at 10.30 a.m. failing which the matter will be decided exparte. Hearing Date : 03-10-2025
// by order of court //
Sd/- R. MALLI REDDY,
Advocate for Complainant, TIRUPATI.
Cell: 94405 74244

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, SRIKALAHASTI.
IP No:14 of 2024
Between:-
Devalla Ankaiah ...Petitioner
And:-
T. Lakshmana Reddy &16 others ...Respondents.
NOTICE TO DEFENDANT
D. Satheesh. S/o Mangaiah, aged about 26 years, Hindu, agriculturist, residing at Chaithanya Puram, Karakambadi post, Renigunta Mandal, Tirupati District..
Please take notice that the above petitioner/plaintiff filed the above suit against for you. For your appearance on:24-09-2025 you (or) your pleader shall be appear at 10-30 Am befor this Honeble court, failure which the suit will be decided in your absence.
K.M. NAGARAJ
Advocate, Srikalahasti

IN THE COURT OF THE HON'BLE 12TH ADDDITIONAL DISTRICT JUDGE, SRIKALAHASTI
A.S.No. 14/2025
OS.No: 4/2005
Between:
Gudluru Mallikarjuna Naidu and 2 others ...Appellants
And:
Polegunta Subbaraya Modali and 8 others ...Respondents
APPELL NOTICE
To,
R6) Jalakam Krishna Kumari, W/o Munaswamy, Hindu, aged about 69 years, resident of D.No.4/239, Sannidhi Street, Srikalahasti Town, post & Mandal, Tirupati District.
R7) Jalakam Hema Kumar, S/o Munaswamy, Hindu, aged about 49 years. resident of Sannidhi Street, Srikalahasti Town, post & Mandal, Tirupati District.
R8) Jalakam Rama Rao, S/o Munaswamy, Hindu, aged about 46 years, resident of Sannidhi Street, Srikalahasti Town, post & Mandal, Tirupati District.
Whereas the appellant has preferred an appeal against the decree and judgment passed in OS No: 4 of 2005 dated 21-03-2025 of Senior Civil Judge, Srikalahasti, you are hereby summoned to appear in the court in person of by a pleader duly instructed by you on 29-09-2025 at 10:30 A.M Take notice that, in default of your failing address for service before the day before mentioned you are liable to have your appearance on the day and hour before mentioned the appeal will be heard and determined in your absence.
(BY order of the Court)
Address for Service
Sri. M. VIJAYASEKHAR
Sri. P. PARDHASARADHI
ADVOCATES
SRIKALAHASTI

IN THE COURT OF THE HON'BLE 12TH ADDDITIONAL DISTRICT JUDGE; SRIKALAHASTI
IA.No: 603 /2025
A.S.No. 14 /2025
OS.No: 4/2005
Between:
Gudluru Mallikarjuna Naidu and 2 others ...Petitioners/Appellants
And:
Polegunta Subbaraya Modali and 8 others ...Respondents/Respondents
APPELL IA NOTICE
To,
R6) Jalakam Krishna Kumari, W/o Munaswamy, Hindu, aged about 69 years, resident of D.No.4/239, Sannidhi Street, Srikalahasti Town, post & Mandal, Tirupati District.
R7) Jalakam Hema Kumar, S/o Munaswamy, Hindu, aged about 49 years. resident of Sannidhi Street, Srikalahasti Town, post & Mandal, Tirupati District.
R8) Jalakam Rama Rao, S/o Munaswamy, Hindu, aged about 46 years, resident of Sannidhi Street, Srikalahasti Town, post & Mandal, Tirupati District.
Whereas the appellant has preferred an appeal against the decree and judgment passed in OS No: 4 of 2005 dated 21-03-2025 of Senior Civil Judge, Srikalahasti, you are hereby noticed to appear in the court in person of by a pleader duly instructed by you on 29-09-2025 at 10:30 A.M Take notice that, in default of your failing address for service before the day before mentioned you are liable to have your appearance on the day and hour before mentioned the appeal will be heard and determined in your absence.
(BY order of the Court)
Address for Service
Sri. M. VIJAYASEKHAR
Sri. P. PARDHASARADHI
ADVOCATES
SRIKALAHASTI

శివయ్య సేవలో ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే సత్య ప్రభ మంగళవారం కుటుంబ సమేతంగా విచ్చేశారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం గురు దక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలకగా, ఎఈఓ మోహన్ ముక్కంటి తీర్థప్రసాదాలు జ్ఞాపికలు అందజేశారు.

పొదుపు రుణాలతో మహిళాభివృద్ధి

ప్రజాశక్తి -కోట : పొదుపు రుణాలు మహిళాభివృద్ధికి ఎంతో దోహదపడతాయని స్త్రీనిధి ఏజీఎమ్ హేమంత్, స్త్రీనిధి మేనేజర్ దాసరి మల్లేశ్వరయ్యలు పేర్కొన్నారు. కోట మండలం, స్థానిక వెలుగు కార్యాలయంలో వెలుగు ఎపిఎమ్ అనీలా ఆధ్వర్యంలో మంగళవారం విఓఎలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్త్రీనిధి ఏజీఎమ్ హేమంత్, మేనేజర్ మల్లేశ్వరయ్యలు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ సభ్యులు తీసుకున్న రుణాలను సకాలంలో బ్యాంకుల్లో జమ చేసే విధంగా చూసుకోవాలన్నారు. అనంతరం 37 మంది ఈవోఏలకు బయోమెట్రిక్ డివైజ్‌లను అందజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక వెలుగు ఏపీఎం అనిలా, సీసీలు ప్రసాద్, శంకరయ్య, శ్రీకాంత్, అలివేలమ్మ, భాస్కర్, అకౌంటెంట్ హిమబిందు, భారతి, తదితర విఓఏలు పాల్గొన్నారు.

పి4 కార్యక్రమంపై సమీక్ష

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం పి4 కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సునీల్ కుమార్, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, ధనికులు మధ్య అంతరం తగ్గించడమే పి4 లక్ష్యమన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వాకాడు ఎక్సైజ్ కార్యాలయం తనిఖీ

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు మండలం, సర్కిల్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం తిరుపతి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస ఆచార్య, ఎక్సైజ్ సూపరింటెంట్ నాగమల్లేశ్వర్ రెడ్డి, సందర్శించి కార్యాలయ రికార్డులను తనిఖీ చేశారు. అసిస్టెంట్ కమిషనర్ మాట్లాడుతూ కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోని 17 షాపుల యాజమాన్యాలు ఎక్సైజ్ ఫీజు బకాయిలు, పర్మిట్ రూమ్‌లకు చెల్లించవలసిన రుసుమును షాపుల వారు చెల్లించే విధంగా ఏర్పాటు చేశామన్నారు.

నేడు రాయితీపై ఉల్లిగడ్డలు పంపిణీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : కర్నూలు ఉల్లి రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు బజార్లలో ఉల్లిగడ్డలు రాయితీపై పంపిణీ చేయాలని నిర్ణయించిందని మార్కెట్ కమిటీ శాఖ కార్యదర్శి తులసి రామ్ తెలిపారు. ఈ మేరకు రైతు బజార్‌లో బుధవారం రాయితీపై ఉల్లి గడ్డలు పంపిణీ చేయనున్నామన్నారు. కేజీ ఉల్లి గడ్డలు రూ.10 కి ఇవ్వనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ డిఎస్ గణేష్, సభ్యులు రమేష్ , ఉమా శంకర్ రెడ్డి, సభ్యులున్నారు.

అనారోగ్యంతో విద్యుత్ ఉద్యోగిని మృతి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: అనారోగ్యంతో ఎస్పీడీసీఎల్ ఉద్యోగిని హిమతనయ(47) మంగళవారం మృతి చెందారు. హిమతనయ ఎస్పీడీసీఎల్ తొట్టంబేడు శాఖలో జేఈగా విధులు నిర్వర్తిస్తున్నారు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నా పోరాడుతూ విధుల్లో కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆమె తుది శ్వాస విడిచారు. ఆమె మృతి పట్ల విద్యుత్ శాఖ అధికారులు సిబ్బంది సానుభూతిని వ్యక్తం చేశారు.

రాష్ట్ర గవర్నర్‌కు సాదర వీడ్కోలు

ప్రజాశక్తి - రేణిగుంట : తిరుపతి జిల్లాలో 3 రోజుల పర్యటన అనంతరం తిరుగుప్రయాణమయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు మంగళవారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయంలో జిల్లా ఇంచార్జి కలెక్టర్ శుభం బన్సల్.. సాదర వీడ్కోలు పలికారు. అడిషనల్ ఎస్పీ కె.రవి మనోహరాచారి, రేణిగుంట డి ఎస్ పి వై. శ్రీనివాసరావు, రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ సాదర వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు. తిరుమల శ్రీవారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసిన గవర్నర్ తుడా చైర్మన్, టిటిడి బోర్డు సభ్యులు డాలర్స్ దివాకర్‌రెడ్డిని అభినందించారు. ఆలయంలో ఇరువురూ కొద్దిసేపు సంభాషించుకున్నారు. ఏ స్థాయిలో ఉన్నా సేవాగుణం, ప్రజాశ్రేయస్సు మరవకూడదని గవర్నర్ సూచించారు.

ఆర్ సెట్ 2024 కన్వీనర్‌గా ప్రొఫెసర్ ఆర్ ఉష

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ విభాగం ప్రొఫెసర్ ఆర్ ఉషను ఆర్ సెట్ 2024 పరీక్ష కమిటీకి కన్వీనర్‌గా మరియు అదే విభాగానికి చెందిన ప్రొఫెసర్ ఎన్ జాన్ సుష్మాను కో కన్వీనర్ గా నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. ఆర్ సెట్ ద్వారా వివిధ సబ్జెక్టులలో పీహెచ్డీ ప్రోగ్రాంలో ప్రవేశానికి పరీక్షలను నిర్వహించనున్నారు. ప్రొఫెసర్ ఉష అన్ని పరీక్ష విధులు, బడ్జెట్ అవసరాలను పర్యవేక్షిస్తారు.

చంద్రగిరి కోటలో.. కూలిన కోనేరు గోడ

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి కోటలోని పురాతనమైన కోనేరు గోడ ఒక ప్రక్క కూలిపోయింది. సోమవారం రాత్రి చంద్రగిరిలో భారీ వర్షం కురిసింది. దీంతో ఆ గోడ ఒక ప్రక్క కూలిపోయింది. గతంలో ఈ కోనేరులో ఏపీ టూరిజం ఆధ్వర్యంలో బోటింగ్ నిర్వహిస్తుండేవారు. ఆర్కియాలజీ కన్జర్వేటర్ ఆఫ్ అసిస్టెంట్ బాలకృష్ణారెడ్డి మంగళవారం కూలిన కోనేరు గోడను పరిశీలించారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు కోట అధికారులు తెలిపారు.

చిట్టేడులో శ్రీ రాజ రాజేశ్వరి విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-కోట: మండలంలోని, చిట్టేడు గ్రామంలో శ్రీ రాజరాజేశ్వరి ఆలయ ప్రాంగణంలో మంగళవారం రాజరాజేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నాగేంద్ర ఆచార్య మఠం, శ్రీ చిదానంద ఆశ్రమం చిట్టేడు వారి చేతుల మీదుగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహానికి ముందుగా వేద మంత్రాలతో అభిషేకం చేశారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ వీధుల్లో తిరుగుతున్న అమ్మవారికి కర్పూర హారతులతో భక్తులు నీరాజనం పలికారు. గ్రామోత్సవం అనంతరం దేవస్థానం వద్దకు చేరుకున్న అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది.

మట్టి నమూనా సేకరణపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - వెంకటగిరి : పట్టణ పరిధిలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు తిరుపతి భూసార పరీక్షా కేంద్రం వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో మట్టి నమూనా సేకరణపై అవగాహన కల్పించారు. వ్యవసాయ అధికారులు పుష్పావతి, కళ్యాణ్ బాబు, స్థానిక మండల వ్యవసాయ అధికారిణి సుజాత, వ్యవసాయ అధికారి శ్రీనివాసులు, కెవికె శాస్త్రవేత్త డాక్టర్ రాజీవనల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మండల వ్యవసాయ అధికారి నానో యూరియా, నానోడిఏపీ, బయో ఫెర్టిలైజర్లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విఏఏజీ కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: సీఎం సహాయనిధి చెక్కులను లబ్దిదారులకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తన కార్యాలయంలో మంగళవారం అందించారు. ఎంఆర్ పల్లికి చెందిన మునిరాజుకు ఐదు లక్షల పదహారు వేలు, రాజీవ్ నగర్‌కు చెందిన సుధాకర్ కు రెండు లక్షల రెండు వేల ముప్పయ్ నాలుగు రూపాయలు, భవానీనగర్‌కు చెందిన భాగ్యమ్మకు ముప్పయ్ వేల రెండు వందల తొంభైఆరు రూపాయలు, రాజీవ్ గాంధీ కాలనీకి చెందిన రమేష్‌కు నలభై రెండు వేల ఐదు వందల రూపాయలు, శివజ్యోతి నగర్ కు చెందిన జోతీశ్వర్ రెడ్డికి 43,824 రూపాయల చెక్కును అందించారు.

జాతీయస్థాయిలో మెరిసిన అంబేద్కర్ గ్లోబల్ న్యాయ కళాశాల విద్యార్థులు

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయస్థాయి "సంవిధాన్ పే చర్చా-2025 మూట్‌కోర్ట్ పోటీల్లో తిరుపతి అంబేద్కర్ గ్లోబల్ న్యాయ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఫస్ట్ రన్నరప్ బహుమతితో పాటు క్యాష్ అవార్డును సాధించారు. ఈ విజయం సందర్భంగా మంగళవారం కళాశాల విద్యార్థులు భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కళాశాల వ్యవస్థాపకులు చైర్మన్ డాక్టర్ తిప్పారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చిన్మయి, సాహితీ, హర్షిత పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి, జాతీయస్థాయిలో కళాశాల పేరును నిలబెట్టారని తెలిపారు. దేశవ్యాప్తంగా 110 విశ్వవిద్యాలయాలు పాల్గొన్న ఈ పోటీల్లో అంబేద్కర్ గ్లోబల్ న్యాయ కళాశాల రన్నరప్ ట్రోఫీని కైవసం చేసుకోవడం గర్వకారణమని పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన లా కమిషన్ ఆఫ్ ఇండియా చైర్పర్సన్ జస్టిస్ దినేష్ మహేశ్వరి, ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిసింగ్, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయకుమార్ శుక్ల చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. రీసెర్చ్ టెస్ట్ విభాగంలో విద్యార్థిని హర్షిత సెకండ్ ప్రైజు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బిజయ కుమార్ బెహరా, మూట్కోర్ట్ కమిటీ సెక్రెటరీ లక్ష్మీప్రశస్త,టి ఆర్ జూలీమోల్, రేష్మి, అతిర, విష్ణు వందన, అక్షయ్ మిడిల్ టోన్, కార్తిక, స్వగతిక పనిగ్రాహి, శుభమస్తు పాండా, శ్యామలాల్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పిఎసిఎస్‌లు రైతులకు బాసటగా నిలవాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ప్రాథమిక సహకార పరపతి సంఘాలు రైతులకు బాసటగా నిలవాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సూచించారు. కాపుగున్నేరి సహకార సంఘం నూతన కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి హాజరయ్యారు. సంఘం అధ్యక్షులుగా బత్తిరెడ్డి, సభ్యుల చేత ప్రమాణం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సహకార సంఘాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని సహకార సంఘాలకు కమిటీలను నియమించి అభివృద్ధి పథంలో నడిపించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

డీసీఎంఎస్ చైర్మన్ పల్లినేని సుబ్రహ్మణ్యం నాయుడు మృతి

ప్రజాశక్తి - చంద్రగిరి: ఉమ్మడి చిత్తూరు జిల్లా డీసీఎంఎస్ చైర్మన్, చంద్రగిరి మండల టీడీపీ మాజీ అధ్యక్షులు పల్లినేని సుబ్రహ్మణ్యం నాయుడు అనారోగ్యంతో మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆధ్వర్యంలో తిరుపతి రూరల్, సీ.మల్లవరం జంక్షన్ నుండి టీడీపీ నాయకులు, కార్యకర్తలు వందలాదిమంది అనుచరులతో ఆయన సొంత గ్రామమైన పనపాకం పంచాయతీ గడ్డంవారిపల్లెకు ఆయన భౌతిక కాయాన్ని తీసుకొచ్చారు. సమాచారం అందుకున్న నగిరి ఎమ్మెల్యే భాను ప్రకాష్, శాప్ చైర్మన్ రవినాయుడు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ తదితరులు నివాళులు అర్పించారు.

మహిళా యూనివర్సిటీని సందర్శించిన థాయిలాండ్ బృందం

ప్రజాశక్తి - క్యాంపస్ : ప్రిన్స్ ఆఫ్ సాంగ్క్లా యూనివర్సిటీ (థాయిలాండ్), పట్టాని క్యాంపస్ ప్రతినిధి బృందంతో కలిసి మంగళవారం శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. అంతర్జాతీయ విద్యా సహకారం కోసం ప్రత్యేక సమావేశాన్ని వర్సిటీ నిర్వహించింది. రెండు విశ్వవిద్యాలయాల మధ్య విద్యా, పరిశోధన సహకారాన్ని అభివృద్ధి చేయడం ఈ సమావేశం ప్రధాన ఉద్దేశ్యం. వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ వి. ఉమ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్. రజని ,అంతర్జాతీయ సంబంధాల విభాగం డీన్ ప్రొఫెసర్ పి. విజయలక్ష్మి, అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ ఆర్. ఉషా థాయిలాండ్ బృందానికి స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో ఇంటర్న్‌షిప్ అవకాశాలు, అనువర్తిత శాస్త్రాలు, హెల్త్ సైన్సెస్, సామాజిక కార్యక్రమాలలో భాగస్వామ్యం అనే అంశాలపై దృష్టి సారించారు. ఇరు విద్యాసంస్థలు జాయింట్ పీహెచ్.డి ప్రోగ్రాంలు, విద్యార్థుల, అధ్యాపకుల మార్పిడి, నర్సింగ్, సైన్స్, సామాజిక శాస్త్రాలలో పరిశోధనకు అంగీకరించాయి.

5న భక్త కనకదాసు విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తన భక్తి గానంతో భగవంతుని ప్రసన్నం పొందిన దాన శ్రేష్ఠ భక్త కనకదాసు కాంస్య విగ్రహావిష్కరణ అక్టోబర్ 5వ తేదీన తిరుపతి బస్టాండ్ సమీపంలో జరగనుందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కురుబ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ దేవేంద్రప్ప పిలుపునిచ్చారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కొన్ని రాజకీయ పరిణామాల నేపథ్యంలో సంఘంలో అనైక్యత లోపించడం జరిగిందని, అంతర్గత కలహాలను దూరం పెట్టి ఐక్యంగా ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. నెలాఖరులోపు ఎన్నికలు నిర్వహించి నూతన కమిటీని ప్రకటిస్తామన్నారు. మంత్రి సవితమ్మ తన తండ్రి జ్ఞాపకార్థం ఎప్పటికీ గుర్తుండిపోయేలా రూ.8.50 లక్షల రూపాయల విలువైన కాంస్య విగ్రహాన్ని వితరణగా ఇస్తున్నారని, దీనిని తిరుపతికి వచ్చే యాత్రికులు అందరికీ కనబడేలా బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేస్తున్నామన్నారు.

స్విమ్స్‌లో ప్రపంచ పేషంట్ భద్రతా దినోత్సవం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: స్విమ్స్ శ్రీ పద్మావతి హాస్పిటల్ గ్రౌండ్ ఫ్లోర్ ఓ.పి.డి బ్లాక్‌లో ప్రపంచ పేషెంట్ భద్రతా దినోత్సవం అవగాహన కార్యక్రమను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ నాగరాజ్ మాట్లాడుతూ రోగుల భద్రత అనేది ఏ విధంగా ఉండాలో ప్రోగ్రామ్స్‌ను పేషెంట్లకు తెలిసే విధంగా రోగులకు భద్రత గురించి అప్పుడప్పుడు ఆడిటోరియంలో నిర్వహించే కార్యక్రమాల్లో, వాళ్లని భాగస్వామ్యం చేస్తూ రోగులు, రోగి సహాయకులు భద్రత అనేది ఏ విధంగా తీసుకోవాలో, అనుకోకుండా జరిగే అగ్ని ప్రమాదాలు గానీ, అలాగే చిన్న చిన్న గొడవలు పెద్దవి కాకుండా చూసుకొని హాస్పిటల్ వాతావరణాన్ని కాపాడుట, అదే విధంగా చిన్న పిల్లల్ని మార్చడం, దొంగలించడం అటువంటి సమస్యలను ఎదుర్కోవడానికి పాటించాల్సినటువంటి జాగ్రత్తలు, ఇవన్నీ ఎప్పటికప్పుడు రోగులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కమ్యూనిటీ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లలిత్ మాట్లాడుతూ ప్రపంచ రోగి భద్రత దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ సంవత్సరం థీమ్ ప్రతి నవజాత బిడ్డకు సురక్షితమైన సంరక్షణగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎంపిక చేయబడిందని పేర్కొన్నారు. ప్రయోగాపూర్వకంగా మాక్ డ్రిల్ చేసి చూపించారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు డి.ఎస్.ఆర్ కమ్యూనిటీ హాల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వై.జె.పి, టౌన్ అండ్ వెస్ట్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రీజన్ చైర్మన్ డా. బి. కృష్ణమూర్తి, జోన్ చైర్మన్ శ్రీరంజనిలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. రీజన్ చైర్మన్ డా. బి.కృష్ణమూర్తి కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ఐదు వేల రూపాయల విరాళాన్ని టైలరింగ్ క్యాంప్ చైర్మన్ లయన్ రవీంద్రరెడ్డికి అందజేశారు. అనంతరం వృద్ధులకు ఫల సరుకులు అందచేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ 2వ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎం.ఆ.ఎఫ్. లయన్ ఆర్.వి. రావు, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, గమళ్ల పాలెం, శ్రీ సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో కేవీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, మ్యాన్‌కైండ్ ఫార్మసీ వారి ఆధ్వర్యంలో వృద్ధులకు నిత్యవసర సరుకులు, పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ త్రివిక్రమ్ మాట్లాడుతూ వృద్ధాశ్రమానికి సహాయ సహకారాలు అందిస్తామని, అనారోగ్య సమస్యలు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కీర్తి, శేషాద్రి ఆశ్రమం నిర్వాహకురాలు కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

సాధారణ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: వెంకటగిరి మండల అభివృద్ధి కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ తంబి రెడ్డి తనుజ, ఎంపీడీవోల ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులతో మంగళవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాథం మాట్లాడుతూ రైతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. తాగునీరు, శానిటేషన్, వ్యవసాయ, వైద్య, పశు వైద్య, విద్యుత్, ఇరిగేషన్, స్త్రీ సంక్షేమ, విద్యా శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై సమీక్ష జరిగింది. సర్పంచులు మాట్లాడుతూ సంవత్సరం రోజులుగా ఎటువంటి అభివృద్ధి జరగలేదని, నిధులు తమ పంచాయతీకి రాలేదని నిలదీశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు సర్పంచులు పాల్గొన్నారు.

ఇకపై లక్కీ డిప్‌లో అంగప్రదక్షిణ టోకెన్లు

ప్రజాశక్తి - తిరుమల : అంగప్రదక్షిణ టోకెన్ల కేటాయింపు విధానంలో టిటిడి మార్పు తీసుకొచ్చింది. ఇప్పటి వరకు అమల్లో ఉన్న ఫస్ట్ ఇన్ ఫస్ట్ అవుట్ పద్ధతి స్థానంలో లక్కీ డిప్ విధానాన్ని ప్రవేశపెట్టారు. టోకెన్లు మూడు నెలల ముందుగానే ఆన్‌లైన్‌లో లక్కీ డిప్ సిస్టమ్ ద్వారా విడుదల అవుతాయి. డిసెంబర్ నెలకు సంబంధించిన అంగ ప్రదక్షిణ టోకెన్ల కోసం సెప్టెంబర్ 18 నుండి 20వ తేది వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. లక్కీ డిప్ ద్వారా ఎంపికైన భక్తులకు ఈ టోకెన్లను కేటాయిస్తారు. శుక్రవారాలు మినహా ప్రతిరోజూ 750 టోకెన్లు, శనివారాల్లో 500 టోకెన్లు జారీ చేయడం జరుగుతుంది. భక్తులు తిరిగి ఈ సేవ పొందేందుకు గడువు 90 రోజుల బదులు 180 రోజులుగా నిర్ణయించడం జరిగింది.

బైకుల దొంగలు అరెస్టు

ప్రజాశక్తి - తడ: తడ మండలంలో మంగళవారం 11 బైకులను దొంగలించిన ఐదుగురు దొంగలను తడ పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి 11 బైకులను స్వాధీన పరుచుకొన్నారు. పోలీసు వారు అందించిన సమాచారం మేరకు తడ బస్ స్టాండ్‌లో ఇటీవల జరిగిన మోటారు సైకిళ్ల దొంగతనాలకి సంబంధించి దర్యాప్తు జరిపి దొంగతనాలను పాల్పడిన తడ వాసి పాత నేరస్థుడు, రౌడీ షీటర్ కుదిరి సాయి విఘ్నేష్ (26), వరదయ్య పాలెం మండలం తొండూరు సొసైటీకి చెందిన పాలెం గోపాల్ (21), తడ మండలం వేనాడుకు చెందిన వెట్టి రాకేష్ (24), సత్యవేడు మండలం రామచంద్రా పురానికి చెందిన తొండా ముని శేఖర్ (23), సూళ్ళూరుపేట మండలం, కొమ్మినేని పల్లి కి చెందిన బందిలి సూర్యనారాయణ (23)లను పట్టుకుని విచారించగా ఈ చోరీ వివరాలు తెలియవచ్చినట్లు తెలిపారు.

మారిషన్ ప్రధానికి సాదర వీడ్కోలు

ప్రజాశక్తి - రేణిగుంట : తిరుమల, తిరుపతి పర్యటన ముగించుకుని రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న మారిషన్ ప్రధాని నవీన్‌చంద్రకు మంగళవారం సాదర వీడ్కోలు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున జ్ఞాపికను దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ శుభం బన్సల్, ఎస్పీ సుబ్బరాయుడు, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి ఉన్నారు.

స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభి యాన్ ప్రోగ్రాం

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలం, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో డాక్టర్ అరుణ ఆధ్వర్యంలో భవిత కేంద్రంలో స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభి యాన్ ప్రోగ్రాంలో భాగంగా మంగళవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపీసీ గౌరీ శంకర్, సహిత విద్య సమన్వయ కర్త చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.